మేడారం భక్తులకు రామప్ప సిద్ధం

- 5 లక్షల మంది సందర్శిస్తారని అంచనా
- 160 మందితో పోలీసు బందోబస్తు

రామప్ప దేవాలయం



వెంకటాపురం(ఎం):ఆసియా ఖండంలోనే అతిపెద్ద జాతరైన మేడారం సమ్మక్క–సారలమ్మ జాతరకు తరలివచ్చే భక్తజనం యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయాన్ని తిరుగుప్రయాణంలో సందర్శిస్తారు. గురువారం రాత్రి నుంచి ఆదివారం సాయంత్రం వరకు రామప్పలో భక్తుల రద్దీ విపరీతంగా ఉంటుంది. మేడారం సమ్మక్క–సారలమ్మ దేవతలను దర్శించుకున్న భక్తులు తిరుగు ప్రయాణంలో రామప్పను సందర్శించి ఒకరోజు సేదతీరి రామలింగేశ్వరున్ని దర్శించుకొని వెళ్తారు. రామప్ప ఆలయాన్ని సుమారు 5 లక్షల మంది మేడారం భక్తులు సందర్శిస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. రామప్పను సందర్శించే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈఓ బిల్ల శ్రీనివాస్, తహసీల్దార్ వీరభద్రప్రసాద్, ఎస్సై చల్లా రాజు తమ సిబ్బందితో రామప్పలో ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

భక్తులకు వసతులు

రామప్పను సందర్శించే మేడారం భక్తుల కోసం తాగునీటి వసతిని కల్పించారు. రామప్ప పరిసర పరిధిలోని మూడు మిని వాటర్ ట్యాంకుల ద్వారా ప్రజలకు ఫ్లోరైడ్ రహిత తాగునీటిని అందిస్తున్నారు. అంతేకాకుండా రామప్ప గార్డెన్‌లో ప్రియ నేస్తం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం నుంచి శనివారం వరకు ఉచితంగా మినరల్ వాటర్‌ను భక్తులకు పంపిణీ చేయనున్నట్లు ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు పింగిలి నాగరాజు తెలిపారు. అదేవిధంగా రామప్ప పరిసర ప్రాంతాల్లో భక్తుల కోసం 30 తాత్కాలిక మరుగుదొడ్లను నిర్మించారు. మేడారం భక్తుల సౌకర్యార్థమై వెంకటాపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో రామప్ప గార్డెన్‌లో ప్రత్యేక వైద్య శిబిరాన్ని బుధవారం ఏర్పాటు చేశారు. బుధవారం 221 మందికి వైద్య సేవలు అందించినట్లు డాక్టర్ రవీందర్ తెలిపారు.

క్యూలైన్లలో వెళ్లి రామలింగేశ్వరుడి దర్శనం

రామప్పను సందర్శించే మేడారం భక్తుల కోసం ఆలయ అధికారులు క్యూలైన్లను ఏర్పాటు చేశారు. భక్తులు ఇబ్బందులు పడకుండా చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. ఉదయం 6నుంచి సాయంత్రం 6 గంటల వరకు రామలింగేశ్వరుని దర్శన వేళలు ఉండగా మేడారం భక్తుల కోసం రాత్రి 9 గంటల వరకు ఆలయ దర్శన వేళలు పొడగించాలని అధికారులు, అర్చకులు పురావస్తుశాఖ అధికారులను కోరుతున్నారు.

రామప్ప సరస్సు సందర్శన నిలిపివేత

రామప్ప ఆలయాన్ని సందర్శించే భక్తులు రామప్ప సరస్సును సందర్శించే నేపథ్యంలో స్నానాలు చేసేందుకు సరస్సులో దిగి మృత్యువాత పడతారనే నెపంతో ముందస్తు జాగ్రత్తగా పోలీసులు రామప్ప సరస్సు సందర్శన నిలిపివేశారు. దీంతో మేడారం భక్తులు రామప్ప సరస్సుకు చెందిన ఉపకాల్వల్లో స్నానాలు ఆచరించి రామప్ప రామలింగేశ్వరున్ని దర్శించుకుంటారు. రామప్పలో మేడారం భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా 160 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తున్నట్లు వెంకటాపురం ఎస్సై చల్లా రాజు తెలిపారు, వాహనదారులు పార్కింగ్ ప్రదేశాల్లోనే వాహనాలు నిలిపి పోలీసులకు సహకరించాలని కోరారు.



పోలీసు సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఎస్సై చల్లా రాజు



మినరల్ వాటర్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్



భక్తులకు వైద్య సేవలందిస్తున్న డాక్టర్ రవీందర్



రామప్ప ఉప కాల్వలో స్నానాలు చేస్తున్న భక్తులు

మానవత్వం చాటిన పోలీసులు



గర్భిణిని వాహనంలో తీసుకెళ్తున్న పోలీసులు

మేడారం (భూపాలపల్లి రూరల్) : మేడారం జాతర సందర్భంగా భూపాలపల్లి మండలం నుంచి దూదేకులపల్లి వరకు వన్‌వే ట్రాఫిక్ కావడం వల్ల చికన్‌పల్లికి చెందిన గర్భిణి బొడ్డు సమత భూపాలపల్లికి వెళ్లేందుకు ఇబ్బంది పడుతుంది. ఈ సందర్భంలో అటుగా వెళ్తున్న భూపాలపల్లి సీఐ నరేష్ ఇబ్బంది పడుతున్న మహిళను గుర్తించి పోలీసు వాహనంలో భూపాలపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు. దీంతో గ్రామస్తులు సీఐని అభినందిస్తున్నారు.

భక్తులకు ఉచితంగా తాగునీరు పంపిణీ



కన్నాయిగూడెం : మేడారం జాతరలో భక్తులకు రాధ టీఎంటీ సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా మినరల్ వాటర్‌ను పంపిణీ చేశారు. దర్శనం కోసం కాలినడకన గుడికి వచ్చే, తిరుగు ప్రయాణం భక్తులు రాధ టీఎంటీ స్టీల్ వారు ఏర్పాటు చేసిన నీటిని తాగి దాహాన్ని తీర్చుకుంటున్నారు. ఈ సందర్భంగా సంస్థ ఎండీ సుమన్ సరాఫ్ మాట్లాడుతూ.. తమ సంస్థ నుంచి భక్తులకు దాహాన్ని తీర్చాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. జాతర ముగిసే వరకు ఈ కార్యక్రమం కొనసాగిస్తామని తెలిపారు. కంపెనీ జీఎం వీరేష్ కుమార్, ఏజీఎం నరేష్‌గౌడ్, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



మేడారం పోలీస్‌స్టేషన్‌కు కానిస్టేబుళ్లే దిక్కు..!

మేడారం(వరంగల్ క్రైం) : తెలంగాణ కుంభమేళా.. మేడారం జాతరలో దొంగలు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. బుధవారం 20కి పైగా దొంగతనాలు జరగగా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అధికారులు లేకపోవడం గమనార్హం. బంగారం, నగదు కోల్పోయిన బాధితులు నెత్తినోరు మొత్తుకుంటూ స్టేషన్ మెట్లెక్కినా పట్టించుకునే నాథుడు కరువయ్యారు.

ఇద్దరే.. ఇద్దరు

మేడారం పోలీస్‌స్టేషన్‌లో కేవలం ఇద్దరు మహిళా కానిస్టేబుళ్లే భక్తులకు దిక్కయ్యారు. బాధితుల నుంచి ఫిర్యాదు స్వీకరించడం, ఆన్‌లైన్ చేయడం వారికి తలకు మించిన భారంగా మారింది. అధికారులు ఎవరు కూడా లేకపోవడంతో నిర్ణయాలు తీసుకోలేకపోయారు. బాధితుల గోడును ఉన్నతాధికారులకు తెలిపేందుకు ఓ మహిళా కానిస్టేబుల్ ఫోన్‌లో ప్రయత్నించిన ఎవరు అందుబాటులోకి రాలేదు. గతంలో అంతర్ రాష్ట్ర దొంగల కోసం ప్రత్యేకంగా నిఘా విభాగం ఏర్పాటు చేసి బాధితుల నుంచి ఫిర్యాదు అందగానే దొంగలపై దృష్టి సారించి అప్పటికప్పుడు పరిష్కరించిన సంఘటనలున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు మేడారం పోలీస్‌స్టేషన్‌కు అధికారులను కేటాయించి భక్తుల బాధలను పట్టించుకోవాలని విన్నవిస్తున్నారు.

భక్తుడికి గాయాలు

మేడారం(కాటారం) : మేడారం జాతరకు వచ్చిన ఓ భక్తుడు ట్రాక్టర్ ఢీ కొని తీవ్ర గాయాలపాలయ్యాడు. వివరాలు.. కాటారం మండలం గంగారం గ్రామానికి చెందిన రాజు కుటుంబ సభ్యులతో కలిసి ట్రాక్టర్‌లో మేడారం వస్తున్నాడు. బుధవారం తెల్లవారుజామున కాల్వపల్లి–ఊరట్టం మధ్యలో ట్రాఫిక్ జామ్ కావడంతో వాహనం దిగి పరిశీలిస్తున్న క్రమంలో వెనకనుంచి వచ్చిన ట్రాక్టర్ రాజు కాలుపైకి ఎక్కింది. దీంతో అతని కాలు నుజ్జునుజ్జయింది. అక్కడే విధులు నిర్వర్తిస్తున్న పోలీసులు కనీసం భక్తుడికి గాయాలైనప్పటికీ పట్టనట్టు వ్యవహరించారు. తోటి భక్తులు రాజును చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

వాగుపై డ్యామ్ నిర్మించాలి



ములుగు రూరల్: బొగ్గుల వాగుపై డ్యామ్ నిర్మించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి జంపాల రవీందర్ కోరారు. రాయినిగూడెం, సర్వాపూర్ గ్రామాల్లో ఎండీ అంజద్ పాషా అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పలు పార్టీలకు సంబంధించిన 15 కుటుంబాలు సీపీఐలో చేరగా వారిని రవీందర్ ఆహ్వానించి మాట్లాడారు. పార్టీలో చేరిన వారికి ఎల్లవేళలా అన్ని విధాలుగా అండగా ఉంటామని అన్నారు. ఈ ప్రాంతంలో అక్టోబర్ నెల తర్వాత వర్షాలు పడని పక్షంలో పంటలు మొత్తం ప్రతీ సంవత్సరం ఎండిపోయి రైతులకు నష్టం జరుగుతూనే ఉందని అన్నారు. బొగ్గుల వాగుపై డ్యామ్ నిర్మించినట్లయితే 20 గ్రామాలకు నీటి కొరత లేకుండా పంటలు పండే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి ముత్యాల రాజు, గుంజ శ్రీనివాస్, సారయ్య, తదితరులు పాల్గొన్నారు.

'ఆయుష్' వైద్య సేవలు

మేడారం (ఎస్ఎస్ తాడ్వాయి): ఆయుష్ వరంగల్ ఆధ్వర్యంలో భక్తులకు ఆయుర్వేద వైద్య సేవలందిస్తున్నారు. మేడారంలోని టీటీడీ కల్యాణ మండపంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. డాక్టర్ మంజుల భక్తులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందిస్తున్నారు. జాతరకు వచ్చిన భక్తులకు ఆయుర్వేదంపై అవగాహన కల్పిస్తున్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి ఆయుర్వేదం ద్వారా ఉపశమనం కలుగుతుందని వారు పేర్కొంటున్నారు.

తల్లులను దర్శించుకున్న తస్లీమా



ములుగు రూరల్: ఆదివాసీల ఆరాధ్య దేవతలైన సమ్మక్క సారలమ్మల దీవెనలు ప్రజలందరిపై ఉండాలని మానుకోట సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్ కోరుకున్నారు. బుధవారం ఉదయం ఆఫీసుకి వస్తున్న క్రమంలో గూడూరు మండలం వట్టివాగు ప్రాంతంలోని సమ్మక్క సారలమ్మ లను తస్లీమా దర్శించుకున్నారు. ముస్లిం అధికారి అయి ఉండి సమ్మక్క–సారలమ్మ లను దర్శించుకోవటంపై ప్రజలు సంతోషం వ్యక్త పరిచారు.

రూ.50 కొట్టు.. ఆటో ఎక్కు



మేడారం (కన్నాయిగూడెం) : మేడారం మహాజాతరలో భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ బస్టాండ్ నుంచి జంపన్న వాగు వరకు ఆటోలు తిరుగుతున్నాయి. బస్టాండ్ నుంచి జంపన్న వాగు వరకు ఒక్కొక్కరికి రూ.50 తీసుకుంటున్నారు.

అర్జెంట్ పనికి అడ్డగోలు దోపిడీ



మేడారం(కాటారం): మేడారం జాతరలో భక్తులకు ఉచితంగా అందించాల్సిన సేవలకు కొందరు అక్రమంగా డబ్బు వసూలు చేస్తున్నారు. జంపన్నవాగు, పార్కింగ్ స్థలాల వద్ద భక్తుల సౌకర్యార్థం ఉచిత మరుగుదొడ్లు నిర్మించి నీటి సౌకర్యం ఏర్పాటు చేశారు. కానీ.. ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చిన కొందరు సిండికేట్‌గా మారి మరుగుదొడ్లను వినియోగించుకునేందుకు వచ్చిన వారి వద్ద రూ.20 చొప్పున వసూలుకు పాల్పడుతున్నారు. ఎందుకివ్వాలని ప్రశ్నిస్తే తమను దూషిస్తూ.. చేయిచేసుకుంటున్నారని భక్తులు 'సాక్షి'తో వాపోయారు. కాగా.. డబ్బులు తీసుకుంటున్న విషయమై 'సాక్షి' సదరు వసూలుదారులను అడగ్గా.. క్లీనింగ్ చేస్తున్నామని అందుకే డబ్బులు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. సంబంధిత అధికారులే తమను డబ్బు తీసుకొమ్మన్నారని, ఈ తతంగమంతా వారికి తెలుసని సమాధానం ఇచ్చారు. వసూళ్ల వెనుక పలువురు అధికారులకు సంబంధం ఉన్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

చింతల్ నుంచి షటిల్ బస్సులు



మేడారం (వెంకటాపురం) (కె): జాతరలో భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఆర్టీసీ అధికారులు ఉచిత షటిల్ బస్సులను నడిపిస్తున్నారు. చింతల్‌క్రాస్ నుంచి కొంగలమడుగు వరకు ఈ సర్వీసులు నడుస్తున్నాయి. మొత్తం 26 బస్సులను రాత్రింబవళ్లు నడిపిస్తున్నట్లు ఆర్టీసీ అధికారి రజిని కృష్ణ తెలిపారు.

తొక్కిసలాటలో భక్తులకు గాయాలు



మేడారం(మంగపేట) : కన్నెపల్లి నుంచి సారలమ్మను మేడారం గద్దెపైకి బుధవారం సాయంత్రం తీసుకువస్తుండగా తొక్కిసలాట జరిగింది. సారలమ్మను పూజారులు గుడి నుంచి బయటకు తీసుకురాగానే అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు ముందుకు దూసుకు వచ్చారు. దీంతో రోప్ పార్టీ పోలీసులు అదుపు చేసే ప్రయత్నంలో తొక్కిసలాట జరిగింది. ఈఘటనలో భద్రాద్రికొత్తగూడెం జిల్లా భద్రాచలం, అశ్వరావుపేట, ఉప్పబొరు గ్రామానికి చెందిన మహిళలు తొక్కిసలాటలో తీవ్రంగా గాయపడ్డారు. శివసత్తులు పాయం సంగీత, ఇటుకల తేజు అస్వస్థతకు గురయ్యారు. అంతేకాకుండా మడకం పద్మ, ఎట్టి మంగమ్మ, గాలి మన్విత, ఆదిలక్ష్మి, తాటి లక్ష్మి, మడకం శ్యామలు గాయపడిన వారిని సమీపంలోని వైద్యశిబిరంలో చికిత్స నిర్వహించారు.

పుణ్యఫలం జలధార నీరు..



మేడారం(భూపాలపల్లి అర్బన్) : మేడారం చిలకల గుట్ట జలధార నుంచి వచ్చే నీటిని తాగితే పుణ్యం కలుగుతుందని భక్తుల నమ్మకం. జాతరకు వచ్చే భక్తులందరు క్యూలో ఉండి బాటిళ్లు, క్యాన్లు, బిందెల్లో నీటిని తీసుకుపోతున్నారు. బుధవారం అధిక సంఖ్యలో భక్తులు గంటల తరబడి వేచి ఉండి నీటిని తీసుకెళ్లారు. ఈ నీరుతాగడంతో అన్ని రకాల పుణ్యాలు వస్తాయని భక్తులు నమ్ముతారు.

మొబైల్ 108 సేవలు



వెంకటాపురం(కె) : మహాజాతరలో భక్తుల సౌకర్యం కోసం మొబైల్ 108 సేవలు అందుబాటులో ఉన్నాయి. ద్విచక్రవాహనంపై జాతరలో తిరుగుతూ భక్తులకు కావాల్సిన మందులు, వైద్య సేవలు అందిస్తున్నారు.

పరవశించిన పస్రా



గోవిందరావుపేట: సమ్మక్క భర్త పగిడిద్దరాజు బుధవారం ఉదయం పస్రా గ్రామానికి రావడంతో ఒక్కసారిగా భక్తులు భారీగా తరలివచ్చారు. శివసత్తులు ఊగిపోయారు. యువతీ, యువకులు కోయ డప్పుల నడుమ నృత్యాలు శారు. గ్రామ ప్రజలు హారతులతో పగిడిద్ద రాజుకు స్వాగతం పలికారు. దారి పొడవునా.. పగిడిద్దరాజుకు నీళ్లారగిస్తూ.. కొబ్బరికాయలు కొడుతుండటంతో పస్రా గ్రామం పరవశించిపోయింది. పగిడిద్దరాజు ప్రధాన పూజారులు పెనక రాజేశ్వర్, పెనక పురుషోత్తం, పెనక సురేందర్ ఆధ్వర్యంలో పూనుగొండ్లకు చెందిన 150 మందితో కాలినడకన పగిడిద్దరాజుని తీసుస్తున్నారు. 40 మంది పోలీస్ సిబ్బంది రోప్ పార్టీతో పగిడిద్దరాజుకు బందోబస్తు నిర్వహించారు. పడిగ రూపంలో పగిడిద్దరాజు మేడారం వెళ్తున్న క్రమంలో పెద్ద ఎత్తున భక్తులు వరం పట్టారు. సంతానం లేని వాళ్లు, పెళ్లి కాని వాళ్లు, అనారోగ్యంతో ఉన్న వాళ్లు వరం పట్టారు. పోలీసులు ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా తగు చర్యలు చేపట్టారు. పస్రా ఊరి చివరి వరకు పగిడిద్దరాజు వెంట వెళ్లి సాగనంపారు.

జాతరలో ఈ-వాహనాల సేవలు



ఎస్ఎస్ తాడ్వాయి: మేడారం జాతరలో దివ్యాంగులు, వృద్ధుల కోసం ఎలక్ట్రానిక్ వాహనాలను అందుబాటులో ఉంచారు. ఎస్‌బీఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ–వాహనాల్లో దివ్యాంగులు, వృద్ధులను అమ్మవార్ల దర్శనానికి తీసుకెళ్లనున్నారు. రెండు వాహనాలను దేవాదాయ శాఖ ఆవరణలో సిద్ధంగా ఉంచినట్లు ఈఓ రాజేంద్రం తెలిపారు.

వంట కోసం తంటా!



మేడారం(కాళేశ్వరం): తల్లుల దర్శనానికి వచ్చిన భక్తులు వంట చేసుకునేందుకు ఎన్నో తంటాలు పడుతుంటారు. అటవీ ప్రాంతం నుంచి వంట చెరుకు సేకరిస్తున్నారు. కొందరు గుడారాల ఏర్పాటు కోసం కంకవనం నుంచి కంక కర్రలు నరికి తెచ్చుకుంటుండగా.. మరికొందరేమో ఇలా ఎండిన కర్రలు సేకరించి తీసుకొచ్చారు. దారి పొడవునా కంక, కర్రలు మోసుకొస్తున్నవారితో భక్తులకు ఇబ్బందిగా మారింది.

నెమలివి కాదు.. ప్లాస్టిక్ ఈకలు!



మేడారం (వరంగల్ క్రైం) : మహాజాతరలో నెమలి ఈకలు భక్తులను కనువిందు చేస్తున్నాయి. ప్లాస్టిక్ ఈకలు కావడంతో భక్తులు కొనడానికి ఆసక్తి చూపడం లేదు. దూరం నుంచి అవి నెమలి ఈకలుగానే కనిపిస్తున్నాయి. ఒక్కో ఈకను వ్యాపారులు రూ.20కి విక్రయిస్తున్నారు.

నీటి కోసం పాట్లు



వెంకటాపురం(కె): జాతరలో భక్తులు నీటికోసం ఇబ్బందులు పడాల్సివస్తోంది. కొంగలమడుగు ప్రాంతంలో చేతిపంపులు తక్కువగా ఉండటంతో భక్తులు నీటి కోసం అవస్థలు పడుతున్నారు. పొలాల్లో ఉన్న బోర్ల వద్దకు బురదలో వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నారు.

'నిరుద్యోగులను ఆదరించండి'



మేడారం(భూపాలపల్లి అర్బన్) : మేడారంలో కొందరు నిరుద్యోగులు వినూత్నంగా ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ఉన్నత చదువులు చదివాం.. గ్రూప్–1కి ప్రిపేర్ అయ్యాం..అయినా ఉద్యోగం రాలేదు. దీంతో ఉపాధి కోసం కూల్‌డ్రింక్స్ దుకాణం ఏర్పాటు చేసుకున్నామని.. భక్తులు తమ వద్ద కూల్‌డ్రింక్స్ కొనుగోలు చేసి నిరుద్యోగులను ఆదరించాలని గద్దెల నుంచి చిలకలగుట్టకు వెళ్లే దారిలో ఫ్లెక్సీ ఏర్పాటు చేసి వ్యాపారం చేస్తున్నారు.

బోసిపోయిన స్టాళ్లు



కన్నాయిగూడెం: మేడారంలోని గిరిజన మ్యూజియంలో గిరిజనుల సంస్కృతీసంప్రదాయాలు ప్రతిబింబించేలా స్టాళ్లను ఏర్పాటు చేశారు. కానీ, స్టాళ్లలో బుధవారం మధ్యాహ్నం వరకు ఎలాంటి వస్తువులను పెట్టకుండా ఖాళీగా ఉంచారు. దీంతో మ్యూజియంను సందర్శించిన భక్తులు ఖాళీగా ఉన్న స్టాళ్లలో సేద తీరుతూ కనిపించారు.